క్లుప్తంగా...

మణికొండలో భారీ వర్షం

మణికొండ: అప్పటి వరకు ఉక్కపోతగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయి గురువారం సాయంత్రం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో భారీ వర్షం కురిసింది. దీంతో వినాయకులకు నిమజ్జనాలకు తరలిస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లన్నీ జలమయమై ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది. విద్యుత్ సరఫరా సైతం రెండు గంటల పాటు నిలిచిపోవటంతో అంతా చీకటిమయంగా మారిపోయింది. వర్షం నిలిచిపోయిన గంట తరువాత విద్యుత్ సరఫరాను పునరుద్దరించారు. కొందరు వర్షంలో తడుస్తూనే వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

గచ్చిబౌలి: అనారోగ్యంతో బాధపడుతున్న రోగుల కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. గురువారం రూ.9.21 లక్షల చెక్కుల పంపిణీ చేశారు. మియాపూర్, శేరిలింగంపల్లి, మాదాపూర్, కొండాపూర్, చందానగర్, గచ్చిబౌలి డివిజన్లకు చెందిన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.

1న బాలబృందావనం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో బాలబృందావనం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అక్టోబర్ 1వ తేదీన సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'గివింగ్ ఈజ్ ట్రూ రిసీవింగ్' అనే అంశంపై .. 9 నుంచి 14 ఏళ్ల చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 23001234లో సంప్రదించవచ్చు.

వివక్ష లేకుండా అభివృద్ధి పనులు

గోల్కొండ: వివక్షకు తావులేకుండా కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేయిస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకి మిరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో మజ్లిస్ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గోల్కొండ, టోలిచౌకి, నానల్‌నగర్, లంగర్‌హౌజ్ ప్రాంతాల మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలు ఎక్కడ ఉన్నా వాటిని వెంటనే పరిష్కరించడానికి తాను ప్రత్యేక కార్యాచరణను అవలంబిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకుడు సయ్యద్ జబ్బార్ తదితరులున్నారు.

ముగిసిన మట్టి గణపతి నిమజ్జనోత్సవం

చార్మినార్: గంగా మట్టితో తయారు చేయించి ప్రతిష్ఠించిన మట్టి గణపతి విగ్రహానికి వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ నిమజ్జనోత్సవం మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో భక్తిశ్రద్ధలతో జరిగాయి. 108 కలశాలతో పాటు 11 రకాల పండ్ల రసాలు, 54 రకాల సుగంధ ద్రవ్యాలు, వివిధ రకాల పూలు, పాలు, పెరుగు, తేనే.. ఇలా పంచామృతాలతో మట్టి వినాయక విగ్రహానికి ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనోత్సవం పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. రమేష్, మధుసూదన్ యాదవ్, అనంతోజీ హన్స్‌రాజ్, ధన్ను, ఆదిత్య, చలువాది శ్రీకాంత్, కోటిరెడ్డి పాల్గొన్నారు.

లడ్డూలు అ'ధర'హో..



మణికొండ పంచవటి కాలనీ వినాయకుడి పెద్ద లడ్డూను రూ. 5.59 లక్షలకు దక్కించుకున్న దిలీప్‌రెడ్డి, చిన్న లడ్డూలను దక్కించుకున్న వాసంతి శిరీష రామసుబ్బారెడ్డి, చరిష్మారెడ్డి



నెక్నాంపూర్ వినాయకుడి లడ్డూను రూ. 5 లక్షలకు కైవసం చేసుకున్న ఎర్రోళ్ల శంకర్

- పోటాపోటీగా గణేష్ లడ్డూల వేలంపాట
- రూ. లక్షలు వెచ్చించి దక్కించుకున్న భక్తులు

మణికొండ: తొమ్మిది రోజులుగా వినాయకుడి చేతుల్లో పూజలందుకున్న లడ్డూలను భక్తులు వేలం పాటల్లో లక్షలాది రూపాయలకు పాడి దక్కించుకున్నారు. వినాయకుడి చేతిలోని లడ్డూలను కొనుగోలు చేస్తే తమకు రియల్ ఎస్టేట్ తదితర వ్యాపారాలలో కలిసి వస్తుందనే నమ్మకంతో ప్రతి సంవత్సరం వాటిని దక్కించుకునేందుకు వందల మంది పోటీలు పడుతుంటారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని వినాయక మండపాల వద్ద గురువారం నిర్వహించిన లడ్డూల వేలం పాటలు పోటాపోటీగా జరిగాయి. వేలం పాటల్లో అత్యధిక ధరకు పాడి లడ్డూలను దక్కించుకున్న వారికి నిర్వాహకులు సన్మానాలు చేసి వాటిని అందజేశారు.



పుప్పాలగూడ లడ్డూను రూ. 1.57 లక్షలకు దక్కించుకున్న కస్తూరి సతీష్

బండ్లగూడ జాగీరు మున్సిపల్ పరిధిలో...

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ వెంకటేశ్వరనగర్ కాలనీలో ప్రతిష్ఠించిన గణనాథుడి లడ్డూ వేలం పాటలో రూ. 3.35 లక్షలు పలికింది. కాలనీకి చెందిన బుర్ర సాయిగౌడ్ లడ్డూను దక్కించుకున్నారు. 7వ డివిజన్ పోచమ్మ తల్లి దేవస్థానంలో లడ్డూను శివప్రసాద్ రూ. 3.51 లక్షలకు దక్కించుకున్నారు.

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 22వ డివిజన్ యాదవమిత్ర కాలనీలో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూ 1.36 లక్షలు పలికింది. కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ ఈ వేలం పాటలో పాల్గొని లడ్డూను దక్కించుకున్నారు.



రూ. 3.35 లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్న బుర్ర సాయిగౌడ్

నక్షత్ర కాలనీలో...

శంషాబాద్: నక్షత్ర కాలనీలోని వినాయకుడి లడ్డూను వేలం పాటలో ఎలిజాల కౌశిక్ రూ. లక్షకు దక్కించుకున్నారు.



చిత్రపురి కాలనీలో లడ్డూను రూ. 2.51లక్షలకు దక్కించుకున్న సొసైటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్



అలకాపూర్ పీవీఎస్ అసోసియేషన్ లడ్డూను రూ. 3.11 లక్షలకు దక్కించుకున్న సాయిరాం



రూ. 1.36 లక్షలకు లడ్డూను దక్కించుకున్న బండ్లగూడ మేయర్ మహేందర్‌గౌడ్..



మణికొండ శివపురి కాలనీలో లడ్డూను రూ. 1.85 లక్షలకు దక్కించుకున్న అర్జున్



నక్షత్ర కాలనీలో వేలం పాటలో లడ్డూను దక్కించుకున్న ఎలిజాల కౌశిక్‌గౌడ్



పోచమ్మ తల్లి ఆలయంలోని లడ్డూను రూ. 3.51 లక్షలకు కైవసం చేసుకున్న శివప్రసాద్



మణికొండ నవజ్యోతి యూత్ లడ్డూను రూ. 9 లక్షలకు దక్కించుకున్న ముంగి మోహన్‌రెడ్డి



మణికొండ హుడా కాలనీ లడ్డూను రూ. 3.25 లక్షలకు దక్కించుకున్న వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి



మార్కండేయనగర్‌లో లడ్డూను రూ. 61 వేలకు దక్కించుకున్న శ్రావణ్‌కుమార్

ప్రశాంతంగా గణనాథుడి నిమజ్జనం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పత్తికుంట, మీరాలం చెరువు, పల్లె చెరువులలో గురువారం వినాయక ప్రతిమల నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం వరకు మొత్తం 1100 ప్రతిమలను నిమజ్జనం చేశారని, రాత్రి వరకు నిమజ్జనం కొనసాగుతుందని ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. ఉదయం దక్షిణ మండలం జోనల్ కమిషనర్ నిమజ్జన చెరువులను పరిశీలించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పలు సూచనలను చేశారు. మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన నిమజ్జనోత్సవంలో భక్తులతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గణనాథుడికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పూజలు

మైలార్‌దేవ్‌పల్లి: గగన్ పహాడ్‌లోని శివగణేష్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన గణనాథుడికి గురువారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండప నిర్వాహకులు ఎమ్మెల్యేకు శాలువాతో సన్మానించారు.



రాజేంద్రనగర్‌లో వినాయకులను నిమజ్జనం చేస్తున్న భక్తులు, నాయకులు



మార్కండేయనగర్‌లో గణనాథుడికి బతుకమ్మ ఆడుతూ వీడ్కోలు పలుకుతున్న మహిళలు



సత్య కాలనీలో బండ్లగూడ జాగీరు కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్



బాబుల్‌రెడ్డినగర్‌లో బీజేపీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి...

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- కురుమ సంఘ భవన నిర్మాణానికి సానుకూలం
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటూ వారి అభ్యున్నతికి పాటుపడుతోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కురుమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు ఎగ్గె మల్లేశం అధ్యక్షతన ఎమ్మెల్యేను కలిసి సంఘం నూతన భవనం నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ... కురుమ సంఘం భవనం నిర్మాణంతోపాటు స్థల విషయమై ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. త్వరలో భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. అన్ని కులాలు, మతాలను సమనంగా చూస్తు పేదల అభ్యున్నతికి పాటుపడుతున్నారన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కురుమ సంఘం అధ్యక్షుడు తాండ్ర రమేష్‌కుమార్ కురుమ, ఉపాధ్యక్షులు ఎర్ర విజయ్‌కుమార్, మల్లేష్ కురుమ, పి.రమేష్ కురుమ, ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మణ్ కుర సంయుక్త కార్యదర్శి కె.సత్యనారాయణ కురుమ, ఆర్గనైజర్ సెక్రటరీ సత్యనారాయణకురుమ, కోశాధికారి ఎస్.వితలయ్యకురుమ, కార్యదర్శులు సురేందర్ కురుమ, బాబురావు, అల్లి శ్రీశైలం, బాలరాజు, శ్రీశైలం, కృష్ణయ్యకురుమ, సలహాదారులు పి.అనంతరాజు, మాణిక్యం, కార్యవర్గ సభ్యులు జగదీష్, వెంకటేశం, అంబయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కురుమ సంఘం సభ్యులు

ప్రత్యేక పూజలు.. నిమజ్జన సంబురాలు

- నిమజ్జనానికి తరలిన గణనాథులు
- చివరి రోజు పూజల్లో నాయకులు

మణికొండ: తొమ్మిది రోజులుగా పూజలందుకున్న వినాయకులు గురువారం నిమజ్జనాలను తరలాయి. చివరి రోజు గురువారం ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రత్యేక పూజలు అందుకుని, మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానాలు, సాయంత్రం లడ్డూల వేలం పాటల అనంతరం నిమజ్జనాలకు తరలించారు. చివరి రోజు పూజల్లో మణికొండ మున్సిపల్ చైర్మెన్ కె. నరేందర్‌ముదిరాజ్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ డి.రేఖయాదగిరి, వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్‌లతో పాటు కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.



అలకాపూర్ ఎంజీ పార్కులో...



నెక్నాంపూర్ వినాయక పూజలో పాల్గొన్న వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు



నార్సింగి 8వ వార్డు వినాయకుని పూజలో పాల్గొన్న కౌన్సిలర్ ప్రవీణ్‌కుమార్



మణికొండ నవజ్యోతి యూత్ వినాయకుని పూజలో పాల్గొన్న చైర్మన్ నరేందర్‌ముదిరాజ్



మణికొండ గార్డెన్ వినాయక పూజలో పాల్గొన్న బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి



అలకాపూర్ రోడ్డు నెంబర్-13లో అన్నదానం



పుప్పాలగూడ వినాయకుడి పూజలో భక్తులు

విద్యార్థినులకు ఆధ్యాత్మిక విషయాలు బోధించాలి

గోల్కొండ: విద్యార్థినులకు దేశభక్తితో పాటు ఆధ్యాత్మిక విషయాలు బోధించాలని జి.పుల్లారెడ్డి విద్యా సంస్థల చైర్మన్ జి.రాఘవరెడ్డి అన్నారు. గురువారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలల వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాల విద్యార్థినులు భక్తిగీతాలతో పాటు వివిధ దేవతల వేషధారణలో అందరిని ఆకట్టుకుంటున్నారన్నారు. అనంతరం విద్యార్థినుల బృందం, అధ్యాపకుల బృందం కలిసి కళాశాల వినాయకుడి లడ్డూను సంయుక్తంగా లక్ష రూపాయలకు కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పుల్లారెడ్డి విద్యా సంస్థల వైస్ చైర్మన్ జి.శ్రీవిద్యారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

'శోభాయాత్రకు అన్ని ఏర్పాట్లు చేశాం'

చార్మినార్: నిమజ్జనోత్సవ శోభాయాత్రకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. పాతబస్తీ నుంచి కొనసాగే వినాయక నిమజ్జనోత్సవ శోభాయాత్రను పురస్కరించుకుని ఆయన గురువారం చార్మినార్ వద్దకు చేరుకుని ఏర్పాట్లను పరిశీలించారు. సంబంధిత పోలీసు అధికారులతో బందోబస్తు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతబస్తీ శివారు ప్రాంతమైన బాలాపూర్ నుంచి పాతబస్తీ ద్వారా హుస్సేన్‌సాగర్ వరకు కొనసాగే ప్రధాన ఊరేగింపు సాఫీగా జరుగుతోందన్నారు. అదేవిధంగా నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌తో పాటు దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, దక్షిణ తూర్పు మండలం డీసీపీ సీహెచ్. రూపేష్ తదితరులు బందోబస్తును పర్యవేక్షించారు.

సీపీఐ కార్యకర్త మామిడిపూడి రామారావు కన్నుమూత



హఫీజ్‌పేట్: భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ కార్యకర్త మామిడిపూడి రామారావు (77) గురువారం కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లోని వృద్ధాశ్రమంలో కన్నుమూశారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరావు ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి ఎర్ర జెండా కప్పి నివాళ్ళర్పించారు. రామారావు మృతి పట్ల సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, అధ్యక్షులు, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి రామకృష్ణ, సీపీఐ చిత్తురు జిల్లా నాయకులు రాము నాయుడు, మురళి తదితర ప్రముఖులు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. శ్రద్ధాంజలి ఘటించన వారిలో సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవరావు, హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కె.రజిని, వృద్ధాశ్రమ కమిటీ సభ్యులు డాక్టర్ సరస్వతి, రాజేంద్రరావు, మేనేజర్ శ్రీనివాస్, వృద్ధులు ఉన్నారు.